# మనుష్యులూ మృగాలూ

కర్రా ప్రభాకర్



'లెఫ్ట్...రైట్...లెఫ్ట్...రైట్...

కెప్టెన్ రావుగారు ప్రొద్దున కాలువ ఒడ్డున నడిచిపోతూంటే ప్రక్కగుడిసెల్లోని పిల్లలు సైనిక కవాతు తాళం వేస్తూ అరుస్తున్నారు. 70 ఏళ్ళరావుగారు మందహాసంతో మీసాలు మెలివేస్తూ, వాళ్ళవైపు కోరచూపులు చూస్తూ 'నా వెనకాల నడవండి' అని వాళ్ళకి సైగచేశారు. ఆ కుర్రాళ్ళు వెంటబడ్డారు. కాని ఆయనతో సమానంగా నడవలేకపోయారు. పరుగెత్తారు. మంచం ఇంకా దిగని యువకులు మరి నిద్రపట్టని ముసలాళ్ళూ అది చూస్తూ వినోదం అనుభవిస్తున్నారు. పిల్లలలా అంటున్నారని కెప్టెన్ రావుగారు ఉడుక్కోవటంలేదు. పైగా 70 ఏళ్ళ తనకు ఒక మెప్పుగా భావించి మనసులో మురిసిపడి, ఇంకా విసురుగా ఠంచన్‌గా అడుగేస్తున్నారు. అలసిపోయిన పిల్లలు వెనకబడిపోయారు. గుడిసెలు దాటి చేలమీదుగా చకచకా నడిచిపోతున్నారు. కెప్టెన్ రావుగారు తన బంగళా వైపుకి.

దారిలో శ్మశానం వుంది. దానిని సమీపిస్తూంటే ప్రక్క సందులోంచి శవం ఊరేగింపు ఒకటి వస్తోంది. బాండ బాగా మోగుతూంది. కెప్టెన్ రావుగారు మిలిటరీ కవాతులో నడుస్తూంటే బాండ్ వాళ్ళు కూడా మిలిటరీవాద్యం వాయించసాగారు. ఆబాండ్ వాద్యం విని రావుగారు మరీ మిలిటరీ ఠీవితో నడిచారు. అది చూసి శవం మోసే నలుగురు అనుకోకుండానే 'లెఫ్ట్...రైట్...లెఫ్ట్...రైట్' వాద్యానికి అనువుగా తామూ చకచకా ఠంచనుగా అడుగువెయ్యడం మొదలెట్టారు. ఊరేగింపులోని జనం దుఃఖం మరిచిపోయి వినోదంగా చూస్తున్నారు.

కెప్టెన్‌రావుగారుగారికి తన మిలిటరీ జీవిత గత స్మృతులేవో మెదడులో రేగినట్లున్నాయి—కవాతు నడకలోనే పాత ధ్యానం చిత్రగించారు—తను మిలిటరీలో వున్న రోజుల్లో, వేరు వేరు సందర్భాలలో, ఈ మిలిటరీ బాండ్ వాద్యానికి వెంట నడిచేరు. మిలిటరీకాంపులో ట్రైనింగ్ అవుతున్నప్పుడు, తనకు కమీషను ఇవ్వబడినప్పుడు, ఉన్నత సైనికనాయకుల సందర్శనాలప్పుడు, స్వాతంత్ర్య రిపబ్లిక్ దినోత్సవాలప్పుడు మిలిటరీనాయకుల అంత్యక్రియలసమయంలో — ఇలా ఎన్నెన్నో పేరేడ్లు జరిగాయి-వాటి అన్నిటిలోనూ తను పాల్గొన్నాడు.

సైనిక అంత్యక్రియల పెరేడ్‌మాత్రం ఆయన హృదయంలో విశేషస్థానం ఆక్రమించుకుంది. అనాధగా అజ్ఞాతగా చచ్చి కుళ్ళి నశించిపోయిన సైనికులు ఎందరో ఉన్నారు. చచ్చినవానికి శ్రద్ధతో, గౌరవంతో, విందులతో, పొంపుతో అంత్యక్రియలు జరగడంకంటె ఆత్మశాంతి జీవితసార్ధకం మరేముంది, అనుకుంటారు కెప్టెన్‌రావుగారు. అందుకనే— 'కుల మత విభేదాలు లేకుండా చచ్చిన వారందరికీ బాండ్, బాజాభజంత్రీలు, భజనలు పాటలూ పూలూ దండలుతో పదిమందీ చేరి పండుగలా ఊరేగింపుతో స్మశానానికి తీసుకువెళ్ళి అంత్యక్రియలు జరిపించాలి' అని బల్లగుద్ది వాదించేవారు రావుగారు— తను సర్వీసులోవున్న రోజుల్లో క్లబ్బు మీటింగుల్లో తను చచ్చిపోయిన తరువాత తనకు అటువంటి ఫక్కీనే అంత్యక్రియలు జరిపించాలి అని తన విల్లులో వ్రాసి దానికయే ఖర్చుకు ధారాళంగా

క్షణం కేటాయించారు!

ఆ శవం ఊరేగింపు తన ముందునుంచి సాగిపోతూంటే ఠీవిగా ఠంచన్‌గా నిలుచుని సలాంపెట్టారు కెప్టెన్‌రావుగారు. అంత వరకూ వినోదంగా చూసిన ఆ జనం ఆయనకు నమస్కారాలు చేశారు. కెప్టెన్‌గారి పట్ల గౌరవభక్తులతో వారి కళ్లు చెమ్మగిల్లాయి. శవం దాటి వెళ్లిపోయిన మరో నిమిషంవరకూ దానివైపే చూస్తూ నిలుచుండిపోయారు, పరధ్యానంలో గత స్మృతుల్లో. ఆ స్మృతుల ఉద్రేకంలో తెలివితెచ్చుకొని 'టక్...టక్, టక్...టక్...' అని బూట్లు తొక్కుతూ ముందుకు సాగిపోయారు.

ప్రతి ఉదయం ఇది కెప్టెన్ రావుగారి జీవితంలో మొదటిది ముఖ్యమయినదీ అయిన కార్యం. చీకటితోటే లేచి పైజామా కమీజాతోటే మిలిటరీ బూటు హాట్ వేసుకుని తుపాకిలా చేతికర్ర అదిమి పట్టుకుని తన బంగాళానుంచి పొలం చివరకీ, ఆ చివరినుంచి తిరిగి తన బంగాళావైపుకి ఒకమైలుదూరం, కాలువ గట్టున కవాతునడకలో 'మార్నింగ్ వాక్' చేస్తూంటారు. ఏళ్లువచ్చిన వృద్ధు అని చాటేది ఆయన నెరిసిన జుట్టు మాత్రమే. కళ్లలో కాంతి, కాళ్లలో చక చక, వంటిలో విసురు; మాటలో పటుత్వం— ముమ్మూర్తులా మిలిటరీ మూర్తి ఇంకా, కెప్టెన్‌రావుగారు. వారి 'మార్నింగ్ వాక్' ఆ పొలం వారికి పరిచితమయినదే, కాని ఎవరికీ వారిని ఆపి అడిగే సాహసంలేదు. మిలిటరీ కవాతులో ఆపడాలు ఆగడాలు ఉండవుకదా— కమాండరు ఆజ్ఞకు తప్ప!

పొలం ఓ చివర. కెప్టెన్ రావుగారి బంగళా మరోచివర. కాలువగట్టు వెంబడే వున్నాయి. పొలం గుడిసెలకీ రావుగారి బంగాళాకీ మధ్య ఒక ఫర్లాంగువరకూ ఇళ్లులేవు; చేలూచెట్లు మాత్రమే. ఆ గుడిసెలు ఆఖరయినచోట ఒక చిన్న 'మిలిటరీ హోటేలు' వుంది. దాన్ని ఎప్పుడో ముప్ఫయిఏళ్ల క్రితం మిలిటరీలో రిటైరయిన ఒక వంటవాడు పెట్టాడు, ఆ పొలెంలో స్థిరపడిపోయి. అతను పోయిన తరువాత కూడా అతని కొడుకు కామయ్య, నడుపుతున్నాడు దాన్ని. మంచి పాక; శుభ్రంగానే వుంటుంది. పదార్థాలు కూడా రుచిగా శుభ్రంగా, చవకగా వుంటాయి. అమలాపురం నుంచి రాజమండ్రి వరకూ వెళ్లే రాదారి పడవలు ఆ పొలెందగ్గర ఆగుతాయి అరగంటసేపు వెళ్లేపుడు వచ్చేప్పుడు, సరుకుల ఎగుమతులు దిగుమతులకి. అప్పుడు మంచి గిరాకీ వుంటుంది హోటలుకి. అప్పుడే వచ్చేలాభం కాస్తాను. అందుచేత చీకటితోటే మాత్రం జనం ఆట్టేమంది ఉండరు, బల్లలూ బెంచీలు రాత్రిపూట కడిగేస్తాడు కనుక పొద్దున్నకి ఆరి శుభ్రంగా వుంటాయి. అప్పుడే టీ తయారుచేస్తాడు; క్రితం సాయంత్రం అమలాపురం బేకరీ నుంచి వచ్చిన రొట్టెలు అద్దాలపెట్టెలో పేరుస్తాడు. దేముడికి దీపంపెట్టి అగరువత్తులు వెలిగించి లెంపలేసుకుని దండంపెట్టి వ్యాపారం ప్రారంభిస్తాడు కామయ్య. అతనికి రోజూ బోణీ కెప్టెన్ రావుగారు!

ఆ సమయానికి తన 'మార్నింగ్ వాక్' ముగింపు ఘట్టంలో ఆ హోటలులో కూర్చుంటారు రావుగారు. హాట్ బల్లమీద పెట్టి చేతి కర్రమీద గడ్డం ఆన్చి, తల కొంచం వంచి కళ్లజోడు పై అద్దాల లోంచి ఒక అర్ధరుమాపు కామయ్యమీద ప్రసరిస్తారు. సలాంకొట్టి 'ఫస్టుక్లాస్' టీ ఒకకప్పు తయారుచేసి వారి ముందు పెడతాడు కామయ్య, బట్లరుకున్న వినయవిధేయతలు ఒలికపోస్తూ—తన తండ్రి ద్వారా సంక్రమించిన మిలిటరీ వారసత్వం. మారుమాట ప్రశ్నచూపులు లేకుండా, తానుచేసిన కవాతు శ్రమకి పరిహారపానీయంలా తన్మయత్వం, తృప్తితో తాపీగా ఆ కప్పు టీ ఆరగిస్తారు కెప్టెన్ రావుగారు.

ఆనాడు అలా ఆ కప్పు పెదిమల ముందర పెట్టుకుని త్రాగబోతూంటే బల్లక్రింద బూటికాలికి ఏదో అడ్డుపడినట్లయింది. గోనెసంచియో పడకచుట్టో అనుకుని బూటుకాలితో నెట్టెయ్యబోయారు రావుగారు. త్రోసినా కదిలినట్లు లేదు అది. తను కాలువ గట్టున నడుస్తూంటే దారిలో రాయోరప్పో వుంటే ఫెడీలున బూటుకాలితో ఒక్కతన్ను తన్నేవారు—అది రోడ్డు ప్రక్కకి దొర్లిపడేట్లా! అది స్మరణకి వచ్చిందేమో— ఒక్కతన్ను తన్నారు, 'కుంయ్...కుంయ్' మంటూ పట్టరానిబాధతో బొబ్బపెట్టింది బల్లక్రింద చిన్న కుక్క ఒకటి. 'అరె' అని త్రుళ్లిపడి బల్ల క్రిందికి వంగి చూడబోయారు. ఆ తొందరలో చేతిలోని టీ కప్పు బల్లమీద పడిపోయింది. అందులోని వేడి టీ మీదకి ఒలికిందేమో మళ్లీ 'కుంయ్...కుంయ్' మంది కుక్క. కెప్టెను రావుగారికి ఒళ్లు జలదరించింది. 'అరెరే' అంటూ లేచి నుంచోబోయారు. బల్లకీ బెంచీకీ మధ్య ఆట్టే ఎడంలేదేమో— బల్లముందుకి ఒరిగిపోయింది; బెంచీ వెనక్కి పడిపోయింది. రెంటికీ మధ్య నిలువచోటు లేక క్రిందపడపోతూ నేలమీద చేయి ఆని ఆపుకోబోయారు. ఆ చెయ్యి తనమీద బలంగా పడినట్లుంది, మళ్లీ 'కుంయ్... కుంయ్' మంది కుక్క. జుగుప్స కలిగింది రావుగారికి. వెంటనే లోపలనుంచి, టీ చేస్తున్న కామయ్య పరుగేసి వచ్చి రావుగారిని లేవనెత్తాడు, ఆయన బరువుకి క్రిందకు పడబోతూ తప్పించుకుని. రావుగారులేచి బట్టలు దులుపుకుని సర్దుకున్నారు. కళ్లజోడు సవరించుకుని తీక్షణంగా చూశారు ఆచిన్ని కుక్కవైపు. తనని, కెప్టెన్‌ని భారీ 'మనిషి'ని క్రింద పడేసినకుక్క—'మృగం' వైపు చూశారు ఆశ్చర్యంగా!

ఆ చిన్న కుక్క ఎంతో దీనంతో, నిరపరాధి అయినట్లు, నోరులేని దీనురాలయినట్లు అమాయకంగా అసహాయంగా రావుగారికేసి చూపింది వణుకుతూ. ప్రశ్నార్థకంగా కామయ్య వైపు చూశారు రావుగారు. సమాధానంగా తనకేమీ తెలియదన్నట్లు తల అడ్డంగా ఊపి, కామయ్య, 'ఎక్కడో దెబ్బతిని రాత్రి ఎప్పుడో బల్ల క్రిందికి చేరుకున్నట్లుంది, సార్' సంజాయిషీ ఇచ్చుకున్నట్టు — కెప్టెన్‌గారు ఏ కోపంలో ఎవరిని ఏం చేస్తారో అన్న భయం కళ్లలో కక్కుతూ, అన్నాడు. కళ్లు మూసుకుని వేళ్లతో నుదురు ఒకసారి మర్దనా చేసుకున్నారు రావుగారు — 'కుక్క పిల్ల వల్ల తనకు పతనం కలిగిందా, తన వల్ల కుక్కపిల్లకి యాతన కలిగిందా' అన్న జిజ్ఞాసతో. ఒక సమాధానానికి వచ్చినట్లుగా గట్టిగా ఊపిరి పీల్చి విడిచారు.

వంగుని ఆ కుక్కపిల్లని ముట్టు

న్నారు: మళ్లీ కొడతారేమో అన్న భయం కలిగినట్లు 'కూఁ...కూఁ...' అని మూలిగింది కుక్క. దీని భావం గ్రహించినట్లు 'చ్చు...చ్' అంటూ దాన్ని బుజ్జగించి వళ్లు నిమిరారు. నమ్మకం కలిగినట్లు నాలిక చప్పరిస్తూ తోకాడించింది అది. దానివళ్లు అన్నిచోట్ల నెమ్మదిగా నొక్కడం ప్రారంభించారు. గాయం ఎక్కడ తగిలిందో పరీక్షిస్తున్నట్లు. మోకాలి దగ్గర నొక్కేసరికి గభీలున 'కుంయ్' మంది వళ్లంతా వణికించుకుని. గ్రహించారు రావుగారు. ఎవరో కాలుమీద కొట్టినట్లున్నారు. ఇది చూస్తున్న కామయ్య పొకమారులోంచి ఒక ఆకు పొట్లం తీసి రావుగారికి అందిచ్చాడు. అందులోని లేపనంతో కుక్క కాలు నెమ్మదిగా మర్దనా చేసి తన చేతి రుమాలు వేడినీళ్లలో తడిపి దాని కాలుకి కట్టుకట్టారు రావుగారు. కొంచం రొట్టె, పాలు కామయ్య చేత తెప్పించి దానికి పెట్టారు. అది ఆరగించి కొంచెం తేరుకుంది. కుక్క, కృతజ్ఞతతో రావుగారికేసి చూస్తూ తోక ఆడించింది. తృప్తిగా నిట్టూర్పు విడిచారు రావుగారు.

మళ్లీ ఆలోచనలో పడ్డారు. దాన్ని అక్కడ వదిలేస్తే ఎలా? ఇంకో వారం పదిరోజులు కట్టుకట్టి చికిత్స చేస్తేనే గాని అది పూర్తిగా కోలుకోలేదు. కామయ్యకి వదిలేస్తే, తను వెళ్లిపోయిన తరువాత తరిమి తోలెయ్యవచ్చు. పోనీ తన బంగళాకి తీసుకుపోదామనుకున్నారు ... 'అహఁహఁ...వద్దు...వద్దు' అనుకున్నారు మరుక్షణంలో. తన బంగళాలో ఒక మంచి జాతి, అందమయిన, పరువమయిన అల్సేషియన్ కుక్క వుంది; మగది. దాన్ని చాలా గారాబంగా, దర్జాగా సంబరంగా పెంచుతున్నారు. మరి ఇది—ఏ జాతిదో, ఎక్కడిదో, ఎవరిదో, అసహ్యంగా పుసులుకట్టి, పీలగా, బక్కగా వుంది; ఆడది. రెంటినీ తనయింట చేరిస్తే భండాలం అవుతుంది. ఎంత భూతదయ వున్నా హద్దులూ అంతస్థులూ వుండాలనుకున్నారు. ఈ కుక్కని తన యింటికి తీసుకువెళ్లకూడదని నిశ్చయించుకున్నారు. మరి?

కామయ్యని పిలిచి అన్నారు: 'చూడు,

## మనుషులా ...

కామయ్యా! దీన్ని నీదగ్గరే వుంచుకో. రోజూ రొట్టె పాలూ ఇస్తూ పెంచు: మందూ మాకులూ నయం అయేవరకూ నేనిస్తా. దాని తిండిఖర్చుకి వారం వారం నీకు డబ్బిస్తా. నయం అయిన తరువాత నీ హోటలుకి కాపలా కాస్తుంది ... ఎప్పుడయినా అదంతట అదే లేచిపోతే మాట్లాడకూరుకో. నీ అంతట నువ్వు మాత్రం తరిమితోలెయ్యకు...ఏమంటావు?'

ఇందులో తనకేం నష్టం కష్టం లేదనుకున్నాడు కామయ్య. 'ఎస్సార్!' అన్నాడు. 'అయితే మధ్యాహ్నం హోటలు మూసిన తరువాత నా బంగళాకి రా. మందూ గీదీ ఇస్తాను. డబ్బుకూడా ఇస్తాను' అన్నారు రావుగారు. అంతకుముందు కెప్టెన్ రావుగారి బంగళా సంగతి వినడమేకాని చూడలేదు తను. తనతండ్రి మిలిటరీలో వున్నపుడు మిలిటరీ ఆఫీసర్ల జీవితం, ఇల్లూ ఎలా వుంటుందో గమనించాడు: 'బోయి'కి, బట్లరుకి మంచి తిండి సరదా వస్తువులూ తరుచు బాగా దొరుకుతూంటాయి. తనకీ ఎన్నో తెచ్చిపెట్టేవాడు తండ్రి. సంబరంతో 'అలాగే వస్తా సార్' అన్నాడు కామయ్య.

కెప్టెన్ రావుగారు లేచారు. ముందుకు సాగుతూ ఒకసారి కుక్కకేసి చూశారు. అది తన కృతజ్ఞత వెల్లడిస్తూ తలెత్తి చూపి తోక ఆడిస్తూ 'టా...టా' చెప్పింది! పొట్ట ఉబ్బరించి 'హహ్హహ్హ' అని నవ్వుతూ 'జిల్లీ...టా...టా' అన్నారు దానికి నామకరణంచేసి చెయ్యి ఆడిస్తూ రావుగారు. వెనుకనుంచి చెయ్యి ఆడిస్తూ ముందుకు అడుగువేస్తూ మళ్లీ కవాతులో సాగిపోయారు. కామయ్య, జిల్లీ వారికేసే చూస్తూ ఉండిపోయారు—ఆనాటి విచిత్ర సంఘటనకి విస్తుపోతున్నట్లుగా!

* * *

మధ్యాహ్నం మామూలు ప్రకారం ఓ గంటసేపు హోటలుమూసి కెప్టెన్ రావుగారి యింటివైపు బయలుదేరాడు కామయ్య. కుక్కకి మందు, డబ్బుమీది శ్రద్ధకంటే కెప్టెన్ రావుగారి బంగళా బ్రతుకుతెరువు చూద్దామనే ఆత్రం ఎక్కువగా వుంది అతనిలో. మలుపు మళ్లడంతోటే ఎదుట కనిపిస్తుంది, రావుగారి బంగళా, పెద్ద బంగళా ఏమీకాదు. కాని అందంగా, రంగురంగుల పెయింట్‌తో ముచ్చటగానే వుంది. కొత్త ఫక్కీని కట్టినది అది. ఒక చిన్న ఉద్యానం మధ్యగావుంది. పూల వాసనలు ఘుమ ఘుమ లాడుతున్నాయి. ముక్కునిండుగా పీల్చుకున్నాడు కామయ్య. పొద్దుతిరుగుడు పూలు విచ్చి తనవైపు తిరిగి గాలికి క్రిందికీమీదికీ ఆడుతూ తనకు ఆహ్వానం చెప్పినట్లయింది అతనికి. చెట్లమీది పళ్లు నోరూరించాయి. తోటమధ్యన పెద్ద కుండీవుంది. దాని నీళ్లలో ఒకసారి తొంగిచూశాడు. 'నువ్వెవరవు?... ఎందుకొచ్చావు?' అని నిలదీసినట్లయింది ఆ నీటిలోంచి ఎవరో. తననీడకే జడిసినట్లుగా వెనక్కి వచ్చాడు కామయ్య. బంగళా మెట్లవైపు నడిచాడు. 'బ్భౌంయ్యా... బ్భౌంయ్' మని గర్జించింది ఎదుటనుంచి కెప్టెను రావుగారి కుక్క పులి—'టైగర్'— 'ఏమైనా చెడ్డపని చేశావంటే చంపేస్తా జాగ్రత్త' అని హెచ్చరించి నట్లుగా. ఆ గర్జనకే అతని గుండె ఆగిపోయినట్లయింది. మనసుని పరిశీలించుకుంటూన్నట్లుగా గుండెమీద చెయ్యివేసుకుని నిలుచుండి పోయాడు. టైగర్ మొరుగు విని తుడుస్తూన్న తుపాకితో బైటికి వచ్చారు రావుగారు. చటుక్కున ఒకడుగు వెనక్కేసి నిలుచున్నాడు కామయ్య తనని కాలుస్తారేమో అని భయపడినట్లుగా. 'రావోయి, కామయ్యా' అని ఆప్యాయంతో అన్న రావుగారి పిలుపువిని, కోలుకుని, జంకుతూ టైగర్ ప్రక్కనుంచి రావుగారి దగ్గరికి వచ్చాడు. టైగర్‌ని నిమురుతూ 'ఏం చెయ్యదులే' అన్నారు రావుగారు. ధైర్యంగా టైగర్‌కేసి చూశాడు కామయ్య. పరిగ్రహించినట్లుగా తలాడించి ప్రక్కగా వెళ్లింది టైగర్ ఇక తన పని అయినట్లు.

'డబ్బిస్తా, తీసుకో' అంటూ లోపలికి నడిచారు రావుగారు. వెనుకనే నడిచాడు కామయ్య. తన గదిలోని ఇనప్పెట్టె తెరిచారు రావుగారు. దొంతర్లు దొంతర్లుగా ఉన్నాయి నోట్లకట్టలు అందులో. చటుక్కున వెనుతిరిగి చూశారు రావుగారు. ఎదుటనే నుంచుని చూస్తున్నాడు ఇనప్పెట్టెలోకి కామయ్య. వెంటనే ఇనప్పెట్టె మూసేసేరు రావుగారు ఒక్క

క్షణం ఇటుతిరికి కళ్ళుమూసుకుని వేళ్ళతో నుదురు మర్దించుకున్నారు. 'ఇదంతా కామయ్య కళ్ళ ఎదుట ఎందుకు పెట్టాను' అని తర్కించుకున్నట్టుగా. వెంటనే కుదురుకున్నారు తన పిరికితనానికి తనవే పరిహసించు కుంటున్నట్లుగా నవ్వారు. నిన్ను అనుమానించటం లేదోయి అని హామీ యిచ్చినట్లుగా కామయ్య కేసి చూసి చిరునవ్వు నవ్వి అతని ఎదుటనే మళ్ళీ ఇనప్పెట్టె తెరిచారు. ఒక నోట్ల కట్ట తీసి కామయ్య కేసి తిరిగారు. అతను నిశ్చలంగానే నిలబడి వున్నాడు. ఒక ఐదు రూపాయల నోటు తీసి అతని కిచ్చి ఇనప్పెట్టె మూసేశారు. అలమారు తెరిచి ఒక మందు డబ్బా, కొంచెం గాజుగుడ్డ, దూది తీసి కాగితం సంచిలో పెట్టి కామయ్య కిచ్చారు. అణకువతో అవి అందుకున్నాడు కామయ్య. తరువాత యిద్దరూ తోటలోకి వచ్చారు. చెట్లూ మొక్కలూ పరికించారు. తోట పెంపకం గురించి అడక్కుండానే కొన్నిసలహాలు చెప్పాడు కామయ్య, ముందు ఎందుకైనా అవసరమవుతాడు అన్న దూరదృష్టితో శ్రద్ధగా తల ఆడించారు రావుగారు. మరి కొంచెంసేపు ఈమాటా ఆమాటా ఆడి కామయ్యని పంపించేశారు.

ఆమరునాటి ఉదయం 'మార్నింగ్‌వాక్' ముగించుకుని యథాప్రకారం హోటలులో

# మనుషులా ...

కూర్చున్నారు రావుగారు. 'టీ' త్రాగుతూ జిల్లీకేసి చూశారు అది బల్లక్రిందనే పడుకుంది. కాని బాగా తేరుకున్నట్లుంది. సంతోషంతో నాలిక తోక ఆడించింది రావుగారి కేసి చూస్తూ. జిల్లీగురించి నాలుగు మాటలాడి కామయ్యని మళ్ళీ మధ్యాహ్నం హోటలు మూసినప్పుడు — తన బంగళాకి రమ్మన్నారు వెళ్ళిపోతూంటే తోకతో 'టా...టా' చెప్పింది జిల్లీ. నవ్వుతూ 'జిల్లీ ... టా ... టా' అంటూ వెళ్ళిపోయారు రావుగారు.

మధ్యాహ్నం మళ్ళీ వెళ్ళాడు కామయ్య రావుగారి బంగళాకి. ఈసారి టైగర్ మొరగలేదు. దాని తల నిమురుతూ సరాసరి లోపలికి వెళ్ళాడు. ఈవిధంగా 2, 3 రోజుల కోసారి చొప్పున వెళ్ళివస్తున్నాడు, రావుగారి బంగళాకి కామయ్య. అతని చేత తన తుపాకి పిస్తోలు తుడిపించేవారు రావుగారు. ఆపని తనతండ్రిదగ్గర ఇది వరకే నేర్చుకున్నాడు కామయ్య. నేర్పుగా శ్రద్ధగా చేసేవాడు. మెచ్చుకునేవారు రావుగారు.

ఇలా 5, 6 వారాలు గడిచిపోయాయి. జిల్లీ బాగా తేరుకుంది. తిండి పట్టిచ్చిందేమో వళ్ళుచేసింది. వళ్ళు రావడంతో రంగూ రూపం వచ్చాయి. చెంగు చెంగున




చలాకీగా గంతులేసి పరుగెత్తుతూంది దాన్ని అప్పుడప్పుడు రావుగారి బంగళాకి వెళ్ళేటప్పుడు తనతో తీసుకువెడుతూండేవాడు కామయ్య. కాని, కాంపౌండు బైట చెట్టుక్రింద దాన్ని వదిలేసి వెడుతూండేవాడు. ఎంత శ్రద్ధ చూపినా ఈ కుక్క పెళ్ళికూతురు తన ఇంట్లోకి రావడం రావుగారికి ఇష్టంలేదని కామయ్యకి తెలుసు. మిలిటరీ అధికారి కోసమూ తనకి బాగా తెలుసు. రావుగారు హోటలునుంచి వెళ్ళిపోతూన్నప్పుడయినా జిల్లీ ఆయన వెంట వెళ్ళబోతే కామయ్యని పిలిచి కట్టెయ్యమనేవారు రావుగారు. అంతవరకే జిల్లీమీద వారి శ్రద్ధ.

కెప్టెన్ రావుగారు సాయంత్రాలు తరుచు పక్కని వున్న చిన్నపట్నంలోక్కివెళ్ళి తనకు కావలసిన సరుకులు తెచ్చుకుంటూంటారు. పాలానికి కొన్నిగజాల దూరంనుంచి వెడుతుంది బండిరోడ్డు పట్నానికి. పాలెంలోకి బళ్ళు రావు. అందుచేత పాలెందగ్గర రోడ్డుమీద బండిదిగి బంగళాకి నడిచివెళ్ళి పోతూంటారు. అప్పుడప్పుడు చీకటిపడినా చేతిటార్చి లైటు వెలుతురులో చులాగ్గా వచ్చేస్తూంటారు బంగళాకి. బూట్ల టకటక్‌లు పిల్లల 'లెఫ్ట్...రైట్' పదం — కెప్టెను రావుగారిపోకడ ప్రకటిస్తాయి పాలెంలోని జనానికి. పాలెంలో ఆగకుండానే, వెనుతిరగకుండానే, వడి తగ్గించకుండానే వెళ్ళిపోతూ వుంటారు కెప్టెన్ రావుగారు.

ఓ రోజున అలా — పట్నంనుంచి బంగళాకి తిరిగి వస్తున్నారు. పాలెందాటివచ్చారు. బంగాళావైపు దారి పాతదే కనుక టార్చిలైటు వెయ్యకుండానే చరచర నడుస్తున్నారు. చీకట్లో బంగాళా సమీపానికి వచ్చేసరికి ఏదో చప్పుడయినట్లయింది. ఆగి పరికించారు. లైటువేసి చూశారు. చెట్ల చీకటిలో ఆనూకి ఏమీ దొరకలేదు. ఊపిరి బిగపట్టి విన్నారు. గాలిచప్పుడు అనుకున్నారు. మరి రోజూ వున్నదేకదా, ఈగాలిచప్పుడు ఏమి టో భ్రమ అనుకున్నారు. ముందుకు సాగారు. నేలమీది ఎండుటాకుల్లో ఎవరో నడిచినట్లయింది. శంకించి ఆగారు. చప్పుడూ ఆగినట్లయింది. మళ్ళీ టార్చివేసి నలువైపులా చూశారు. ఏమీ తెలియలేదు.

ఏ జంతువయినా పోతున్నట్లుంది అనుకున్నారు. 'ఏమిటీ భయం?' అనుకున్నారు. 'అబ్బే భయంకాదు! కుశ్శంక. కుశ్శంక వుంటడం మంచిదే మంచీచెడూ ఆలోచించడమన్న మాట' అని తర్కించుకున్నారు. చరచరా బంగళావైపు నడిచారు.

తను ఇంట్లో లేనప్పుడు టైగర్‌ను గొలుసు తీసేసి కాంపౌండులో వదిలేస్తారు. కాంపౌండు గేటుమాత్రం తాళం వేస్తారు. గోడలు ఎత్తుకనుక కుక్కలు దాటలేవు. తను తిరిగివచ్చి గేటుతాళం తీస్తుంటే తన బూట్లచప్పుడు పసిగట్టి గేటు దగ్గరికి వస్తుంది టైగర్ గుర్రు పెడుతూ, 'ఇంత అలస్యం అయిందేం' అని ఆరాతీసినట్లు 'టైగర్... టైగర్. అథటూ తాళంతీసి లోపలికి వస్తారు. రావుగారు. ఆయన కాళ్లకి రాసుకుంటూ ఆయన్ని లోపలికి తీసుకువస్తుంది టైగర్ దానితో 'అంతా క్షేమమే' అనుకుంటూ బంగళాలో ప్రవేసిస్తారు.

మరి ఆరోజున గేటుదగ్గరికి వచ్చేసరికి అక్కడ టైగర్ జాడలేదు. 'టైగర్... టైగర్' అని కేక వేశారు...బదులు లేదు. ఈ సారి నిజంగానే వళ్లు అదిరింది కెప్టెన్ రావుగారికి. ఏదో అపసవ్యం పొడగట్టింది. దానితో మొండిధైర్యం వచ్చింది. ఆ మొండిధైర్యంతో చకచకా టార్చిలైటులో మెట్లెక్కి వసారాలోని లైటు స్విచ్ వేశారు లైటు వెలిగీ వెలగడంతో 'హాండ్సప్' అన్న ఉరుము వినిపించింది. టార్చి పడేసి చేతులెత్తి వెనుతిరిగి చూశారు.

చేత పిస్తోలు గురిపెట్టి పదిగజాల దూరములో మెట్లక్రింద నుంచున్నాడు కామయ్య! 'కామయ్యా' అని అరిచి స్తంభించి పోయారు కెప్టెను రావుగారు. పరిస్థితి గ్రహించేశారు. కామయ్య తన ఇంటి వ్యవహారం అంతా ఆకట్టాడు. తనే తన ఇనపెట్టలోని సొత్తు అతనికి చూపించాడు. అతని చేతిలోని పిస్తోలు తనదే. దానితో నిలువునా చంపి పారేస్తే అతనిమీద ఏమిటి బుజువు? తన డబ్బు తీసుకుని తనని వదిలేటంతటి మూర్ఖుడవుతాడా కామయ్య. అనుకున్నారు టైగర్ కోసం కళ్లు పరుగెత్తాయి. మెట్లక్రింద మత్తులో పడివుంది టైగరు.

దాని ప్రక్కనే సారాయికంపు కొడుతూ పడివున్నాయి మిలిటరీ హోటలులోని రొట్టెముక్కలు కొన్ని. టైగర్‌ని మత్తుపెట్టి ముందుగానే జాగ్రత్తపడ్డాడు మరి, కామయ్య.

'నీకేం కావాలి' అన్నాడు ధైర్యంగా కామయ్యకేసి అసహ్యంగా చూస్తూ. బదులు చెప్పకుండా తనవైపు వస్తున్నాడు కామయ్య పిస్తోలు గురిపెట్టి. ఆ దృశ్యం కెప్టెన్ రావుగారికి పరిచితమైనదే తనూ ఎన్నోసార్లు శత్రువుని ఇలా కాల్చేశారు యుద్ధ సమయాల్లో. అది ఆఖరిఘట్టం. అంతా క్షణాలలో గడిచిపోతుంది. ఇక్కడా ఇది అంతా క్షణాలలో గడిచిపోయింది. ఈ క్షణమో మరుక్షణమో పిస్తోలు గుండు తన గుండెలోంచి దూసుకు పోతుంది. ఏలాగూ చస్తాం కాబట్టి మీదికి ఉరుకుదామా అనుకుంటూండగానే ఎక్కడ నుంచి వచ్చిందో అమాంతం కామయ్యమీదికి ఉరికింది జిల్లీ. అనుకోని పరిస్థితికి అదిరిపడ్డాడు కామయ్య. జిల్లీ, చేతమీదికి ఉరకడంలో పిస్తోలు వెనుతిరిగి పేలి కామయ్య కంఠంలోంచి కపాలంలోకి దూసుకుపోయింది గుండు. తెగేసిన కొమ్మలా కూలిపోయాడు కామయ్య. గభీలున తలుపు తీసి లోపలికి పరుగెత్తి తుపాకి తీసు కొచ్చారు రావుగారు.

రక్తంతో తడిసిన వంటితో తోక ఆడిస్తూ వారి దగ్గరకి వచ్చింది జిల్లీ. ఆ రక్తం వంటితోనే దాన్ని వడిలోకి తీసుకున్నారు రావుగారు. ఈ సందడికి తెలివి వచ్చినట్లుంది, మూలుగుతూ లేచింది టైగర్. జిల్లీనిమాసి కళ్లు పెద్దవి చేసింది. వళ్లు గట్టిగా ఝూడించుకుని తోక ఆడిస్తూ దాన్ని సమీపించ బోయింది.

ఇది చూసేసరికి జుగుప్స కలిగింది రావుగారికి. వెంటనే తుపాకి ఎత్తిపెట్టి కాల్చి పారేశారు టైగర్‌ని! గుండుదెబ్బకి 'బౌయ్' మని కామయ్యమీదికి ఒరిగిపోయింది టైగర్ — అందమయిన మగకుక్క! మహారాజులా పెరిగిన జాతికుక్క! ప్రాణంమీదికి వచ్చినప్పుడు పనికిరాని పాడు కుక్క! కాళ్లని చుట్టుకుంది జిల్లీ— వీధికుక్క, జాతిలేనికుక్క, ప్రాణంపోసిన కుక్క!! తనకేసి ఓసారి చూసుకున్నారు; ఆ ముగ్గురికేసీ ఒకసారి చూశారు; గట్టిగా నిట్టూరుస్తూ అన్నారు కెప్టెన్ రావుగారు 'హుఁ! మనుషులూ, మృగాలూ!!'

